# హామీలు అమలు చేశాం.. ఆదరించండి

- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్
- 59వ వార్డులో విస్తృతంగా ఇంటింట ప్రచారం



ఆనంద్‌కుమార్, పిళ్లా రమాకుమారికి స్వాగతం పలుకుతున్న ప్రజలు

**మల్కాపురం:** గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దాదాపు 98 శాతానికి పైగా అమలు చేశామని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ తెలిపారు. అందుకే త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్లి మళ్లీ తమకు ఓటు వేయాలని అడగగలుగుతున్నామని, ఆ ధైర్యం స్థానిక ఎమ్మెల్యే గణబాబుకు ఉందా అని ఆడారి ప్రశ్నించారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా 59వ వార్డు నెహ్రూనగర్, వాయుపుత్ర కాలనీ, హనుమాన్‌నగర్, మాజీ సైనిక్ కాలనీల్లో గురువారం ఉదయం విస్తృతంగా పర్యటించారు. పేద ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలు, పొందిన లబ్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించారు. ముందుగా ఇక్కడి గణపతి ఆలయంలో యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారితో కలిసి ఆయన పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆడారి మాట్లాడుతూ ఈ వార్డులో గత మూడేళ్లలో సుమారు రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పలువురు వైద్య నిపుణులు నిత్యం అందుబాటులో ఉండేలా కోటీ రూపాయలతో ఆస్పత్రిని ఏర్పాటు చేశామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో తనకు ఒక్కసారి అవకాశమిచ్చి, ప్రజలకు సేవ చేసుకునే భాగ్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ, ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ నాయకుడు సురేష్, క్లస్టర్ అధ్యక్షుడు అంగ రామ్‌ప్రసాద్, ధనలత, అమరావతి, పెంటారావు, తదితరులు పాల్గొన్నారు.

# కొండంత దైవం.. పైడితల్లమ్మ

- 25 నుంచి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం
- దూరప్రాంతాల భక్తులకు వసతి సదుపాయం



అమ్మవారి నిజరూపం



ఉత్సవాలకు ముస్తాబవుతున్న ఆలయం

**కంచరపాలెం:** కోరిన వారికి వరాలిచ్చే కల్పవల్లిగా.. సంతానలక్ష్మిగా కంచరపాలెం పైడిమాంబ అమ్మవారు విరాజిల్లుతున్నారు. 80 ఏళ్లగా అమ్మవారి ఆశీర్వాదం కోసం వేలాది మంది భక్తులు తరలి వస్తున్నారు. రామ్మూర్తిపంతులపేట ప్రాంత ప్రజలు తమ ఇలవేల్పుగా, గ్రామదేవతగా పైడిమాంబ అమ్మవారిని కొలుస్తారు. భక్తి శ్రద్ధలతో ప్రార్థిస్తే కోరికలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ నెల 25న సోమవారం పైడిమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరం, 26న మంగళవారం ప్రధాన జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

**ఆలయ చరిత్ర ఇదీ**

ఇక్కడ పూర్వీకులు వ్యాపారాల నిమిత్తం తగరపువలస ప్రాంతంలో వెలసిన పోలిపిల్లి పైడిమాంబ జాతరకు ఈ గ్రామం నుంచి ఎడ్ల బళ్లపై వెళ్లి దర్శించుకునేవారు. తిరుగు ప్రయాణంలో భీమరశెట్టి గంగన్న అనే వ్యక్తి బండిని మార్గమధ్యలో ఆపి ఓ స్త్రీ మూర్తి ఎక్కికూర్చొంది. ఆమె విశ్వరూపం చూసిన ఆ వ్యక్తి మూర్ఛతో పడిపోయాడు. ఆ బళ్లు ఇక్కడుకు చేరుకోవడంతో ఆ బండిలో దేవతామూర్తి విగ్రహం ప్రత్యక్షం అయిందని ప్రతీతి. దీంతో ఊరి చివర వేపచెట్టు కింద విగ్రహాన్ని నిలిపారు. అప్పటిలో ఈ ప్రాంతమంతా సున్నపు బట్టీలతో అడవిలా ఉండేదని గ్రామపెద్దలు చెబుతుంటారు. ఈ విగ్రహానికి పూజలు చేయకపోవడంతో రామ్మూర్తిపంతులపేట చుట్టూ ఉన్న ప్రాంతాల్లోని ప్రజలకు కలరా,మశూచి, ఆటలమ్మ పలు అంటువ్యాధులతో అల్లాడేవారు. అమ్మవారిని పూజించనందుకే ఇలా వస్తుందని ప్రజలు భావించారు. అప్పటి నుంచి నిత్య పూజలందు కుంటుంది. ప్రతి మంగళవారం అన్నదానం, ఏటా మార్చి నెలలో తొలేళ్ల సంబరాలు, ప్రధాన జాతర, ఘనంగా నవ రాత్రి ఉత్సవాలు, ఆఖరు రోజున భారీ అన్నసంతర్పణ నిర్వహిస్తారు.

## క్లుప్తంగా

### సాయిబాబాకు ప్రత్యేక పూజలు



బాబా వారికి పూజలు చేస్తున్న అర్చకుడు

**విశాఖ విద్య:** జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీలో కొలువుదీరిన శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం బాబాకు పంచామృతాలతో అర్చకులు అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ చేసిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తుల గోత్రనామాలతో అర్చకులు పూజలు నిర్వహించారు. అష్టోత్తర శతనామార్చన పూజలు చేశారు. భక్తులంతా సామాహికంగా సాయి సంకీర్తన ఆలపించారు. సాయంత్రం పల్లకి సేవ వేడుకగా సాగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు విళ్లా సత్యనారాయణ రావు, కోశాధికారి సుబ్బారావు, రాజు, వెంకటేశ్వరరావు, భూలోక్, కిషోర్ పాల్గొన్నారు.

### శ్రమిస్తే విజయం తథ్యం



విద్యార్థులకు జ్ఞాపిక అందిస్తున్న గ్రంథాలయం చైర్మన్ కొండా రాజీవ్‌గాంధీ

**మల్కాపురం:** శ్రమిస్తే విజయం తథ్యమని విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్‌గాంధీ అన్నారు. మల్కాపురం శాఖ గ్రంథాలయంలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాధ్యాన్ని సుసాధ్యం చేయడంలోనే సాయకత్వ ప్రతిభ ఆధారపడి ఉందన్నారు. అనంతరం వివిధ అంశాలపై నిర్వహించి వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, వై.అనసూయాదేవి, గ్రంథాలయాధికారి అజేయ్ పాల్గొన్నారు.

### వృద్ధుల చెంతకు డిప్యూటీ మేయర్



వద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

**విశాఖ విద్య:** జీవీఎంసీ 52 వ వార్డులో గురువారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఎన్నికల ప్రచారం మొదలు పెట్టారు. వార్డు పరిధిలోని కరాస, న్యూ కరాస ప్రాంతాల్లో 85 ఏళ్లు దాటిన వారు, శారీరక వికలాంగుల నివాసాలకు వెళ్లి పలకరించారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కు, విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మీకి ఓటు చేయమని శ్రీధర్ వారిని అభ్యర్థించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన సంక్షేమాన్ని గుర్తుంచి ఫ్యాన్ గుర్తు పై రెండు ఓట్లు వేయాలని కోరారు. ఈ ఏడాది ఎన్నికల్లో వృద్ధుల ఓటు హక్కును ఇంటి వద్దే వినియోగించుకునేలా కేంద్ర ఎన్నికల సంఘం సౌలభ్యం కల్పించిందని చెప్పారు. కార్యక్రమంలో శ్రీదేవి వర్మ, వెదుళ్ల శ్రీను, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు.

# సంక్షేమ ప్రభుత్వానికే ప్రజల మద్దతు

- 92వ వార్డులో ఆడారి ఆనంద్ కుమార్ ప్రచారం
- ఘన స్వాగతం పలికిన స్థానికులు



ర్యాలీగా వెళ్తున్న ఆడారి ఆనంద్ కుమార్



ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఆనంద్ కుమార్

**గోపాలపట్నం:** సంక్షేమ ప్రభుత్వానికే తమ మద్దతు అని ప్రజలు చెబుతున్నారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. జీవీఎంసీ 92వ వార్డు మేహాద్రి గెడ్డ కాలనీలో జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. తొలుత ఇక్కడి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో పలువురు మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి.. అందించిన సంక్షేమ పథకాలను వివరించారు.మహిళల స్వావలంబనకు సీఎం వైఎస్ జగన్ పెద్దపీట వేశారని చెప్పారు.

**ఐదేళ్లలో ఎమ్మెల్యే కనిపించారా?**

ఐదేళ్లలో బయటకు కనబడని ఎమ్మెల్యే ఎన్నికలు రాగానే ఓట్లు వేయాలని సిగ్గు లేకుండా మీ ముందుకు వస్తున్నాడని ఎద్దేవా చేశారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలను పట్టించుకోకుండా ఎన్నికల వేళ వస్తున్న వ్యక్తిని నమ్మవద్దని కోరారు. సంక్షేమ ప్రభుత్వానికి మద్దతుగా వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు ఎస్ఏ రహమాన్, 91, 92 వార్డుల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, నాయకులు కంపర సత్తిబాబు, నీలాపు శ్రీనివాస రెడ్డి, గొంతిన నాగరాజు, సాలాపు మారయ్య, నీలాపు లోకేష్ రెడ్డి పాల్గొన్నారు.

### బుచ్చిరాజుపాలెంలో 365 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ స్టాల్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ రేవతి

**విశాఖ విద్య:** జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ వద్ద గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. సచివాలయం-3 పరిధిలోని కాలనీ నుంచి ప్రజానీకం తరలివచ్చి వైద్య సేవలు పొందారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన శిబిరంలో 365 మందికి వైద్య సేవలు అందించినట్లు యూపీహెచ్‌సీ డాక్టర్ రొంగలి రేవతి తెలిపారు. ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి, శిబిరానికి వచ్చే రోగులకు సంబంధించిన సమగ్ర వివరాలను వైద్య సిబ్బంది నమోదు చేశారు. వారి వివరాలను ఆన్‌లైన్ చేశారు. సాధారణ వైద్య సేవలతో పాటు, చెవి, ముక్కు, గొంతు, స్త్రీల వ్యాధి నిపుణులు, కంటి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. వైఎస్సార్ సీపీ వార్డు నాయకులు చుక్కా ప్రసాద్‌రెడ్డి, నమ్మి శ్రీను, తదితరులు ఏర్పాట్లు చేశారు.

# ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

- ఆర్డీవో హుస్సేన్ సాహెబ్
- పోలింగ్ కేంద్రాల సందర్శన



రాజీవ్ కల్యాణ మండపం వద్ద ఎన్నికల కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్

**గోపాలపట్నం:** సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ చెప్పారు. ఎన్ఏడీ, గోపాలపట్నం ప్రాంతాల్లో పలు పోలింగ్ కేంద్రాలను గురువారం ఆర్డీవో, ఎన్నికల నమోదు అధికారి హుస్సేన్ సాహెబ్ తనిఖీ చేశారు. కేంద్రాల్లో సౌకర్యాలు ఏవిధంగా ఉన్నాయి.. ఏఏ సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్న అంశాలను పరిశీలించారు. 1 నుంచి 5 సెక్టార్లలో ఉన్న పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములగాడ, గోపాలపట్నం మండలాల్లోని 70 రూట్లలో 17 సెక్టార్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈవీఎంల తరలింపు, ఇబ్బందులు ఏర్పడితే వేరే మార్గాలను రూపొందించామని చెప్పారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ఆయా కేంద్రాల వద్ద పోలీసులతో సమన్వయ పరుచుకోవాలని అధికారులకు సూచించామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు, విద్యుత్, మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయాలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఆయన వెంట సెక్టార్ అధికారులు శ్యామ్ సుందర్, కె. బాలరాజు, ఎన్నికల విభాగం డీటీ శ్రీనివాసరావు, ఆర్ఐ సురేష్, ఏఈ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

# అండగా నిలవండి

కొప్పల వెలమ ఆత్మీయ సమావేశంలో ఆనంద్‌కుమార్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్

**సింథియా:** సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అండగా నిలవాలని కొప్పల వెలమ సంఘాల ప్రతినిధులను వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ కోరారు. జీవీఎంసీ 62వ వార్డు తెలుగుదేశంకాలనీలో శ్రీసాయి కొప్పల వెలమ సంక్షేమ సంఘం, జయదుర్గ కొప్పల వెలమ సంక్షేమ సంఘం సభ్యులతో వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మనరావు ఆధ్వర్యంలో ఆడారి ఆనంద్‌కుమార్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి వెనుకబడిన సామాజిక వర్గాల అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. సామాజిక వర్గానికో కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆయా కార్పొరేషన్లకు ప్రత్యేక నిధులు కేటాయించి తద్వారా వారిని ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించి అధికారం అందించాలని కోరారు. రానున్న రోజుల్లో వెలమ సామాజికవర్గం అభివృద్ధికి పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, వెలమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### అవగాహనతో సైబర్ నేరాలకు చెక్

డీసీపీ-2 సత్తిబాబు



విద్యార్థులకు నేరాలపై అవగాహన కల్పిస్తున్న డీసీపీ సత్తిబాబు

**గోపాలపట్నం:** విద్యార్థులు లక్ష్యంపై దృష్టిసారించి శ్రద్ధగా చదువుకోవాలని డీసీపీ-2 సత్తిబాబు సూచించారు. మాధవధారలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో గురువారం ఎయిర్‌పోర్టు పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీసీపీ-2 సత్తి బాబు పాల్గొని నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. బాలికలతో మాట్లాడి వారి సమస్యలు.. ఇబ్బందులు గురించి అడిగి తెలుసుకున్నారు. నేరాలు ఏవిధంగా జరుగుతాయో వివరించారు. సైబర్ నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరం లేని సందేశాలకు సమాధానం ఇవ్వ వద్దని తెలిపారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు సీఐ చక్రధరరావు, హాస్టల్ వార్డెన్ గిరీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# గీతాంజలి మృతికి కారకులను శిక్షించాలి



ఫ్లైఓవర్ కింద అంబేద్కర్ విగ్రహం ఎదుట కొవ్వొత్తుల ప్రదర్శన

**విశాఖ విద్య:** టీడీపీ, జనసేన అల్లరిమూకల పైశాచికత్వమే గీతాంజలి ఆత్మహత్యకు కారణమని విశాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ(ఆల్ఫా కృష్ణ) అన్నారు. వైఎస్సార్ సీపీ, వివిధ మహిళా సంఘాల ఆధ్వర్యంలో గురువారం రాత్రి నగరంలోని ఎన్ఏడీ సెంటర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఫ్లైఓవర్ కింద ఉన్న అంబేడ్కర్ విగ్రహం ముందు కొవ్వొత్తుల చేతపట్టుకొని నిరసన తెలిపారు. గీతాంజలిని పొట్టన పెట్టుకున్న టీడీపీ అల్లరిమూకలను కఠినంగా శిక్షించాలని మహిళలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గీతాంజలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి వస్తోన్న ఆదరణ చూసి టీడీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. ప్రభుత్వం ద్వారా పొందిన మేలును ప్రతి ఒక్కరికీ బహిరంగంగా చెప్పుకునే స్వేచ్ఛ ఉందన్నారు. ఓ మహిళను సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా ట్రోల్ చేసి పైశాచిక ఆనందం పొందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఇది ఎంతమాత్రం భావ్యం కాదన్నారు. గీతాంజలి పిల్లలు అనాథలుగా మిగిలారని, అలాంటి పరిస్థితి మరెవ్వరికీ రాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు జియ్యాని మారుతి, సింహాచలం ట్రస్టు బోర్డు సభ్యురాలు శ్రీదేవి వర్మ, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు కోనాల వినీత, జ్యోత్స్న, సఖి, పద్మ, అనూరాధ, నారాయణమ్మ, గుణవతి జీవీఎంసీ 52, 90వ వార్డులకు చెందిన పలువురు మహిళలు పాల్గొన్నారు.

# స్టీల్‌ప్లాంట్ సభకు రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న నాయకులు గిడుగు రుద్రరాజు, రాకేష్‌రెడ్డి

**సీతంపేట:** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 16న స్టీల్ ప్లాంట్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఆ పార్టీ సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.రాకేష్‌రెడ్డి అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గురువారం విలేకరులతో వారు మాట్లాడుతూ బహిరంగ సభకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నట్టు తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తోందన్నారు. ప్రధాని మోదీ దేశాన్ని అదానీ, అంబానీలకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. ఏపీలో 175 అసెంబ్లీ , 25 పార్లమెంట్ నియోజకవర్గాలకు 1,350 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొంప గోవిందరాజులు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రామారావు, మూల వెంకటరావు, ఎల్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

### కేంద్ర పాలనలో రైతులకు అన్యాయం

**సీతంపేట:** రైతుల ఛలో ఢిల్లీ కార్యక్రమానికి మద్దతుగా సెంట్రల్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ సీఐటీయూ అక్కయ్యపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సంగం ఆఫీస్ కూడలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జోన్ కార్యదర్శి ప్రకాశరావు మాట్లాడుతూ దేశం నా కుటుంబం అంటున్న ప్రధాని మోదీ దేశానికి అన్నంపెట్టే రైతన్నను నిండా ముంచుతున్నారని విమర్శించారు. వ్యవసాయంలో స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర లేదంటే దేశానికి ప్రభుత్వం ఉన్నా.. లేనట్టే అన్నారు. ఓట్ల కోసమే రైతులు అన్నట్టు కేంద్ర ప్రభుత్వ వైఖరి ఉందన్నారు. కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అప్పారావు, రాజు, కార్మికులు పాల్గొన్నారు.

# డాల్ఫిన్ నోస్ వద్ద పోలీసు ఔట్‌పోస్టు ప్రారంభం



పోలీస్ఔట్ పోస్ట్ కార్యక్రమంలో పాల్గొన్న సీపీ రవిశంకర్, నేవీ అధికారులు

**సింథియా :** మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని డాల్ఫిన్‌నోస్ హిల్స్ వై జంక్షన్ వద్ద పోలీస్ ఔట్ పోస్టును నేవీ అధికారులతో కలిసి నగర సీపీ రవిశంకర్ గురువారం ప్రారంభించారు. హార్బర్ సబ్ డివిజన్‌లోని నేవీ ప్రాంతంలో గల యారాడ, లైట్ హౌస్ వంటి పర్యాటక ప్రాంతాలకు చేరువలో పోలీస్ ఔట్ పోస్టును ఏర్పాటు చేయడం వల్ల ఆ ప్రాంతంలో ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్టవేయడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టినట్టు అవుతుందన్నారు. అత్యవసర సమయాల్లో సైతం పోలీసులు అందుబాటులో ఉండేలా ఈ ఔట్‌పోస్ట్ నిర్విరామంగా పనిచేసేలా సిబ్బంది, పాటు డిస్ప్లే, సాంకేతిక పరికరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే ద్విచక్రవాహనాలను సైతం అందుబాటులోకి ఉంచుతామన్నారు. కార్యక్రమంలో నేవీ కమాండర్ హ్యాపీమోహన్, సచిన్ షిండే, జాయింట్ సీపీ కే.ఫకీరప్ప, డీ.సీ.పీ-2 సత్తిబాబు, హార్బర్ సబ్ డివిజన్ ఏసీపీ, మల్కాపురం సీఐ పాల్గొన్నారు.

# 26 నుంచి సింహగిరిపై నృసింహ యజ్ఞం

సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి



మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసమూర్తి

**సింహాచలం:** ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 1వ తేదీవరకు సింహగిరిపై జరిగే శ్రీ సుదర్శన నారసింహ మహాయజ్ఞంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనేలా ట్రస్ట్‌బోర్డు సభ్యులు, విభాగాధిపతులు కృషి చేయాలని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సూచించారు. యజ్ఞం నిర్వహణకు సంబంధించిన విధివిధానాలపై గురువారం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు, విభాగాధిపతులు, వైదిక సిబ్బందితో ఈవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక కల్యాణార్థం నిర్వహించే మహాయజ్ఞం విజయవంతంగా జరిగేలా అందరూ కృషి చేయాలని సూచించారు. దాదాపు పదేళ్ల తర్వాత అత్యంత ప్రతిష్టాత్మకంగా యజ్ఞం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

**రాజగోపురం ఎదురుగా నిర్వహణ**

ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా ఏర్పాటు చేయనున్న యాగశాల, హోమ గుండాలు, భక్తులు యజ్ఞంలో కూర్చునే ప్రదేశాలపై సమావేశంలో అర్చకులు వివరించారు. యజ్ఞం జరిగే రోజుల్లో సాయంత్రం వేళ రోజుకో వాహనంపై సింహగిరి మాడవీధుల్లో స్వామివారి తిరువీధి జరుగుతుందని తెలిపారు. పెద్ద ఎత్తున కోలాటాలు, భజనలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, ప్రత్యేక ఆహ్వానితుడు నరసింహమూర్తి, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవోలు రమణమూర్తి, నరసింగరావు,భ్రమరాంబ, సూపరింటెండెంట్‌లు పిల్లా శ్రీనివాసరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ సబ్సిడీ కోసం సర్వే

**తాటిచెట్లపాలెం:** జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి ఏఎస్సార్ నగర్‌లోని టిడ్కో గృహ సముదాయంలో నివసిస్తున్న వారి ఇళ్లను గురువారం ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎల్.మహేంద్రనాథ్ సందర్శించారు. ఈ ప్రాంతంలో అధికంగా నివసిస్తున్న చెంచు సామాజిక వర్గానికి చెందిన వారితో ఆయన మాట్లాడారు. వీరికి ఎస్సీ, ఎస్టీలకు అందజేసే విద్యుత్ సబ్సిడీ కోసం అవసరమైన కుల ధ్రువపత్రాలను, ఆధార్ కార్డ్ కాపీలను సెక్షన్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. దీని ద్వారా వీరందరికి ఈ పథకం వర్తిస్తుందని అవగాహన కల్పించారు.

# ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

**పీఎం పాలెం :** పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్మకు పాల్పడ్డాడు. రుషికొండ మొహరం హాస్టల్‌లో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు చెందిన టీవీఎస్ షోరూమ్ యజమాని కాసిన రమేష్ కుమారుడు కాసిన జస్వంత్ (19) రుషికొండలోని మొహరం హాస్టల్‌లో వుంటూ గీతం ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం 7 గంటలకు జస్వంత్ రూమ్మేట్ మధన్ రూముకు వచ్చేసరికి డోర్ లాక్ చేసి ఉంది. మారుతాళంతో డోర్ ఓపెన్ చేయగా జస్వంత్ బెడ్‌షీట్‌తో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే అతని స్నేహితులు కిందకు దించి గీతం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. అయితే... జస్వంత్‌కు పిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలించామని తల్లిదండ్రులకు హాస్టల్ వార్డెన్ ఫోనులో తెలియజేయడం గమనార్హం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుని తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.